క్లుప్తంగా

దర్గాలో హరీశ్‌రావు ప్రత్యేక ప్రార్థనలు



ప్రార్థన చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

కొండపాక(గజ్వేల్): మండలంలోని దర్గా గ్రామంలోగల దర్గాలో శనివారం సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రతియేటా జూలై మాసంలో ముస్లింలు ఉత్సవాలను వైభంగా నిర్వహించు కుంటారు. ఈ వారం రోజుల్లో ప్రారంభం కానున్న ఉర్సు నేపథ్యంలో హరీశ్ రావు ముస్లిం మత పెద్దలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాదిగా వస్తున్న ఆచారంలో భాగంగా కుల, మతాలకు అతీతంగా దర్గా గ్రామంలో అందరూ కలిసిమెలిసి ఉత్సవాలను జరుపుకుంటారన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కుమార్, నాయకులు దుర్గయ్య, శ్రీనివాస్, రామ్మోహన్ పాల్గొన్నారు.

అభ్యర్థుల గెలుపే లక్ష్యం



మాట్లాడుతున్న కమలాకర్‌రెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్‌రెడ్డి సూచించారు. మండల పరిధిలోని లింగుపల్లిల, ధర్మారం గ్రామాల్లో శనివారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అభ్యర్థులను గెలిపించుకుని గ్రామాల అభివృద్ధికి పాటుపడాలన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై దృష్టి సారించి వాటి పరిష్కారానికి అధికారులను కదిలించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు అంజిరెడ్డి, లింగం, మల్లేశం గౌడ్, బాలరాజు, బైరయ్య, బాల్ నర్సింహులు, రమేశ్, స్వామి, అశోక్, బాబు, రాజయ్య, ఎల్లయ్య, యాదరిగిరి, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



మొక్క నాటుతున్న హరితసేన ప్రతినిధులు

ములుగు(గజ్వేల్): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు బాధ్యతగా మొక్కలు నాటాలని మండల హరితసేన ఇన్‌చార్జి మహాదేవుని శ్రీనివాస్‌గౌడ్ కోరారు. గ్రీన్ ఇండియా ఛాలెంజ్ హరితసేనలో భాగంగా ఆయన పుట్టిన రోజును పురస్కరించుకుని జిల్లా హరితసేన ఇన్‌చార్జి రాజేశ్వర్‌రావు, గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి అనిల్‌మొగిలితో కలసి ములుగులో శనివారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో నాయకులు జహంగీర్, రాజు, ఆర్యన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కఠిన చర్యలు తప్పవు



ఫుట్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్న ఎస్‌ఐ సౌజన్య

బెజ్జంకి(సిద్దిపేట): రానున్న స్థానిక ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ సౌజన్య హెచ్చరించారు. మండలంలోని బేగంపేటలో శనివారం స్పెషల్ పార్టీ, స్థానిక పోలీసులతో కలిసి ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భం ఆమె మాట్లాడుతూ అలజడులు సృష్టించి ప్రజలకు అసౌకర్యం కలిగించవద్దన్నారు. గ్రామాలలో సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామస్తులు సహకరించాలని కోరారు. ఏఎస్‌ఐ శంకర్‌రావు, పోలీసులు పాల్గొన్నారు.

నిలకడగా విద్యార్థి ఆరోగ్యం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మహాత్మాజ్యోతిరావు పూలే బీసీ సంక్షేమ గురుకులంలో ఫినాయిల్ తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి ఆరోగ్యం నిలకడగా ఉందని ప్రిన్సిపాల్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పూలే బీసీ సంక్షేమ గురుకులంలో పదోతరగతి చదువుతున్న రిషిత్ శుక్రవారం మధ్యాహ్నం ఫినాయిల్ తాగాడు. ఆ విద్యార్థి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. అతడి ఆరోగ్యం నిలకడగా ఉందని, ఆదివారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ కానున్నాడని ప్రిన్సిపాల్ తెలిపారు.

‘ఆరుతడి’ అంతంత మాత్రమే

వర్షాధార పంటలపై మొగ్గు చూపని రైతులు

- వేధిస్తున్న కోతులు, అడవి పందులు
- అందుబాటులో లేని యంత్ర పరికరాలు
- జిల్లాలో తగ్గిన సాగు విస్తీర్ణం



సాగు చేయకుండా వదిలేసిన భూములు

వర్షాకాలం వచ్చిందంటే ప్రతిరైతు తమ భూములను దున్ని చదునుచేసి ఆరుతడి పంటలు వేయడానికి సిద్ధం చేసేవారు. కానీ జిల్లాలో నేడు ఆ పరిస్థితి లేదు. వర్షాలు సమృద్ధిగా, సకాలంలో కురువక పోవడంతో అన్నదాతలు ఆరుతడి పంటలపై ఆసక్తి చూపడం లేదు. అలాగే సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోలేక పోవడంతో సాగు విస్తీర్ణం తగ్గుముఖం పట్టింది.

దుబ్బాకరూరల్: వర్షా కాలంలో రైతులు ఏదో ఒక్క పంట సాగు చేసేందుకు బీడు భూములను కూడా దున్నేవారు. కానీ కొన్నేళ్లుగా మండల పరిధిలోని చాలా ప్రాంతాల్లో ఆ పరిస్థితి లేదు. కారణం వర్షాధార పంటలపై అన్నదాతలు ఆసక్తి చూపకపోవడమే. వర్షాకాలం వచ్చిందంటే గతంలో ఎక్కువగా ఆరుతడి పంటలైన మొక్కజొన్న, జొన్న, కంది, పెసర, బొబ్బెర్లు లాంటి పంటలను ఎక్కువగా సాగు చేసేవారు. ప్రస్తుతం వర్షాలు సకాలంలో కురవకపోవడంతో రైతులు ఆరుతడి పంటలవైపు మొగ్గు చూపడం లేదు. దీంతో భూములను దున్నకుండా వదిలి వేయండతో పొలాల్లో ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు పెరిగాయి. జిల్లాలోని కొన్ని మండలాల్లో వరిసాగు చేస్తుండగా.. ఆరుతడి పంటల సాగు చాలా తక్కువ స్థాయిలోనే ఉంది.

సమస్యలు అనేకం

ఆరుతడి పంటలు సాగు ప్రారంభించిన నాటి నుంచి రైతులు ఎన్నో కష్టాలు ఎదుర్కోవలసి వస్తుంది. వర్షాలు కురిసే వరకు ఎదురు చూడాలి. తీరా కురిశాక దుక్కులు దున్ని సాగు చేయాలి. సమయానికి వానలు కురవకపోతే పంట ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతుంది. దీంతో పడిన కష్టం, పెట్టిన పెట్టుబడులు బూడిదలో పోసిన పన్నీరవుతుంది.

అడవి పందులు, కోతుల బెడద



నీళ్లులేక నాటు వేయని వరి పొలం

కోతులు, అడవి పందులు, ఇతర జీవరాశులు రైతులకు మరో పెద్ద శత్రువులుగా మారాయి. పంటలను నాశనం చేస్తాయనే భయం వెంటాడుతోంది. వర్షాధార పంటలకు అన్నదాతలు దూరమవ్వడానికి ఇదో పెద్ద కారణమైంది. అదే విధంగా కూలీల కొరత, ఆధునిక యంత్రాలు అందుబాటులోకి రాకపోవడంతో సాగుకు దూరమవుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మూడేళ్ల నుంచి దూరంగా ఉన్నాం..



ఒక్కప్పుడు ఆరుతడి పంటలు ఎక్కువగా వేసే వాళ్లం. రెండు, మూడు సంవత్సరాల నుంచి సాగుచేయడం లేదు. కూలీల కొరత, మరోవైపు కోతులు, అడవి పందుల బెడదతో వర్షాధార పంటలు వేయాలంటేనే భయంవేస్తోంది. వర్షాలు కురవకపోతే పంటలు ఎండిపోయే అవకాశం ఉంది. పంటలు కోయడానికి ఆధునిక యంత్రాలు అందుబాటులోకి రాలేదు. - డి.జోగయ్య, రైతు

తక్కువ స్థాయిలోనే సాగు



గతంలో రైతులు వర్షాకాలం వచ్చిందంటే ఆరుతడి పంటలపై ఎక్కువ శ్రద్ధ చూపే వారు. రెండు, మూడేళ్ల నుంచి వర్షాధార పంటలపై ఆసక్తి చూపడం లేదు. వర్షాలు సరైన సమయానికి కురువ పోవడంతో మొక్కజొన్న, జొన్న, కంది, పెసర, బొబ్బెర లాంటి పంటలను చాలా తక్కువ స్థాయిలోనే సాగు చేస్తున్నారు.

- ప్రవీణ్‌కుమార్, మండల వ్యవసాయాధికారి

యూరియా కోసం రైతుల పాట్లు



దౌల్తాబాద్ మండలం హైమద్‌నగర్‌లో యూరియా కోసం బారులు తీరిన రైతులు

దౌల్తాబాద్(దుబ్బాక): మండలంలోని హైమద్‌నగర్‌లో యూరియా కోసం రైతులు బారులు తీరారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో శనివారం 560 యూరియా బస్తాలు అందుబాటులోకి వచ్చాయి. అయితే అధిక సంఖ్యలో రైతులు తరలి రావడంతో సిబ్బందికి తల నొప్పిగా మారింది. దీంతో ఒక్కో రైతుకు రెండు బస్తాలు చొప్పున పంపిణీ చేశారు. అయితే తమకు ఎలా సరిపోతుందని రైతులు సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని రైతులను సముదాయించారు. గతంలో యూరియా కొరత ఎప్పుడూ రాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు బస్తాల యూరియా కోసం రోజంతా పనులు వదులుకొని పడిగాపులు పడాల్సి వస్తుందని వాపోయారు. తగినంత యూరియాను అందుబాటులో ఉంచాలని వేడుకుంటున్నారు. పీఏసీఎస్, ఆగ్రోస్ సెంటర్లకు 1,060 బస్తాల యూరియా వచ్చిందని వాటిని రైతులకు అందజేయడం జరిగిందని వ్యవసాయ అధికారి సాయికిరణ్ తెలిపారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని 33కేవీ సబ్‌స్టేషన్ ఫీడర్‌ల మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఖాదర్‌పుర, నసీర్‌నగర్, కప్పలకుంట, నసీర్‌పుర, ఎర్రచెరువు, రాంనగర్, బారాహిమామ్, శర్వదాన్, మంగమ్మతోట, మోహినిపుర, గణేశ్‌నగర్, కాంచీట్‌స్ట్రీట్, భారత్‌నగర్, బురుజు తదితర ప్రాంతాలలో ఆదివారం ఉదయం 8.30 నుంచి 11.30 వరకు సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

చిన్నకోడూరులో..

చిన్నకోడూరు(సిద్దిపేట): మరమ్మతుల కారణంగా మండల కేంద్రంలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ చాంద్ పాషా తెలిపారు. ప్రజలు, రైతులు సహకరించాలని కోరారు.

రామలింగేశ్వనికి పూజలు

దుబ్బాక: మండలంలోని కూడవెల్లి రామలింగేశ్వర ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢమాసం సందర్భంగా అర్చకుడు సాకేత్‌శర్మ స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు.

గోరింటా.. పూసిందీ..



ఉమామహేశ్వర ఆలయంలో ఆర్యవైశ్య మహిళల సంబురాలు

కొండపాక(గజ్వేల్): ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని కుకునూరుపల్లిలోని ఉమామహేశ్వర స్వామి ఆలయంలో ఆర్యవైశ్య మహిళా విభాగం, వాసవీ క్లబ్‌ల ఆధ్వర్యంలో మహిళలు వాసవీ మాతను శాకంబరి మాతగా అలంకరించి పూజలు చేశారు. సామూహిక పారాయణ నిర్వహించి గోరింటాకు సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆర్య వైశ్య మహిళా విభాగం మండల అధ్యక్షురాలు స్రవంతి మాట్లాడుతూ గోరింటాకు సంబురాలు ఆషాఢమాస ప్రత్యేకత అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య మహాసభ మాజీ అధ్యక్షుడు నవీన్‌కుమార్, నాయకులు పాండురంగం, రాజు, రమ్య తదితరులు పాల్గొన్నారు.

మహంకాళి.. మమ్ము కాపాడు!



శాకాంబరిగా మహంకాళమ్మ

దుబ్బాక: శివ సత్తుల పూనకాలు.. బైండ్లోళ్ల విన్యాసాలు.. డప్పు చప్పుళ్ల మధ్యన శనివారం రాత్రి పట్టణంలో మహంకాళమ్మ బోనాల ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. రెడ్డి సంఘాలు, మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ప్రధాన వీధుల గుండా మహంకాళమ్మ బోనాల ఊరేగింపు కనులపండగగా కొనసాగింది. ఆషాఢమాసం సందర్భంగా అమ్మవారికి మహిళలు ఇంటికి రెండు బోనాలు ఎత్తుకొని మంగళహారతులతో ఆలయానికి తరలివచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించారు. నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అంతకు ముందు అమ్మవారిని శాకంబరిమాతగా కూరగాయలతో అలంకరించారు. వేదపండితులు వేలేటి జయరామశరమ్మ, రామకృష్ణశర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు దర్శించుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వనభోజనాలకు వెళ్లనున్నారు.



బోనాలతో ఊరేగింపుగా మహంకాళమ్మ ఆలయానికి తరలివస్తున్న మహిళలు

సంక్షిప్త వార్తలు

◆ హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

గజ్వేల్: ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఎఫ్‌డీడీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆరోపించారు. గజ్వేల్‌లో 48 మందికి మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను శనివారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ కేసీఆర్ హయాంలో వివిధ పథకాలు విజయవంతంగా అమలయ్యాయన్నారు. కాంగ్రెస్ సంక్షేమ పథకాలను సక్రమంగా అమలు చేయకపోవడం వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని వాపోయారు. ఎన్‌సీ రాజమౌళి, నవాజ్ మీరా, కృష్ణారెడ్డి, రాంచంద్రం, కనకయ్య, రవీందర్, శ్రీనివాస్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

◆ పేదల సంక్షేమమే ధ్యేయం

దుబ్బాక/దౌల్తాబాద్(దుబ్బాక): పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పలువురికి మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను క్యాంపు కార్యాలయంలో శనివారం అందజేశారు. గత బీఆర్‌ఎస్ పాలనలో పేదలకు తీరని అన్యాయం జరిగిందన్నారు. అలాగే దౌల్తాబాద్ మండలంలోని ముబారస్పూర్ రైతు వేదికలో దౌల్తాబాద్, రాయపోల్ మండలాల చెందిన 18 మందికి చెక్కులకు అందజేశారు. రాములు, సుధాకర్, లాలు, శ్రీనివాసరావు, స్వామి, వేణు గోపాల్, మల్లారెడ్డి, మల్లేశం, నరసింహారెడ్డి, నరసింహులు, సాయిలు పాల్గొన్నారు.

◆ అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

సిద్దిపేటజోన్: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ అన్నారు. 14వ వార్డులో ఇందిరమ్మ లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలకు శనివారం నిర్వహించిన భూమిపూజలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ జాబితాలో పేర్లు లేనివారు ఆందోళన చెందవద్దన్నారు. ముద్దం లక్ష్మి, గయాజొద్దీన్, రజిత శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

◆ ఎస్జీటీలకు పదోన్నతులు కల్పించండి

చిన్నకోడూరు(సిద్దిపేట): ఎస్జీటీలకు పీఎస్ హెచ్‌ఎం ప్రమోషన్లు వెంటనే ఇవ్వాలని ఎస్జీటీల ఫోరం రాష్ట్ర కార్యదర్శి నర్సింహాచారి డిమాండ్ చేశారు. శనివారం ఆయన చిన్నకోడూరులో మాట్లాడుతూ ప్రతిసారి పదోన్నతులలో ఎస్జీటీలకు అన్యాయం జరుగుతుందన్నారు. ఇతర సంఘాల నాయకులు ఎస్జీటీలకు మద్దతుగా నిలవాలని కోరారు.

◆ ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తించాలి

కొమురవెల్లి(సిద్దిపేట): ఆటో డ్రైవర్లు మహిళా ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తించాలని ఎస్‌ఐ రాజు సూచించారు. మండల కేంద్రంలోని ఆటో స్టాండ్ వద్ద షీటీం బృందంతో కలసి ఆటో డ్రైవర్లకు యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్, సైబర్ నేరాలు, ఇతర చట్టాలపై శనివారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ కొమురవెల్లి మల్లికార్జున స్వామి దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారని, వారితో మర్యాదగా వ్యవహరించి ఆలయ ప్రతిష్టను కాపాడాలన్నారు. హుస్నాబాద్ షీ టీం సభ్యులు సైదయ్య, ప్రశాంతి, స్వప్న, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

◆ హెల్మెట్ తప్పనిసరి

దౌల్తాబాద్(దుబ్బాక): ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని నూతన ఎస్‌ఐ అరుణ్‌కుమార్ సూచించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వాహనాదారులు తమ వెంట సంబంధిత ధ్రువపత్రాలు ఉంచుకోవాలని సూచించారు. కేజీ వీల్స్‌తో ట్రాక్టర్లు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

◆ మర్యాదపూర్వక కలయిక

సిద్దిపేటరూరల్: రూరల్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై నూతనంగా వచ్చిన ఎస్‌ఐగా కె.రాజేశ్‌ను బీజేపీ మండలశాఖ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్‌ఐని శాలువాతో సన్మానించారు. సురేశ్‌గౌడ్, రమేశ్‌గౌడ్, రాజు, రాకేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పైప్‌లైను నుంచి లీకై రోడ్డుపై కాలువలా ప్రవహిస్తున్న తాగునీరు

తాగునీటి వృథా.. ఆపేవారు లేరా?

- పైపులైను లీకేజీతో నీటి కలుషితం
- పట్టించుకోని అధికారులు

అక్కన్నపేట(హుస్నాబాద్): పైపులైన్ లీకేజీ వల్ల తాగునీరు వృథాగా పోతోంది. ఆ గ్రామ ప్రజలు కలుషిత నీరు తాగుతున్నారు. మండలంలోని గోవర్ధనగిరిలో పెద్దమ్మ దేవాలయం ఎదురుగా ఉన్న నల్లాబావి నుంచి వచ్చే పైపులైను లీకై తాగునీరు రోడ్డుపై వృథా ప్రవహిస్తోంది. 15 రోజులుగా ఇదే పరిస్థితి నెలకొన్నా పట్టించుకునే నాథుడు లేదని స్థానికులు వాపోతున్నారు. ఈ పైపులైను ద్వారానే పాఠశాల ఎదుట ఉన్న వాటర్ ట్యాంక్‌తోపాటు పరికిబండలో ట్యాంక్‌కు నీళ్లు ఎక్కిస్తారు. ఆ నీరు నల్లాల ద్వారా సరఫరా అవుతుంది. కానీ లీకేజ్ కారణంతో తాగునీరు కలుషితమవుతుందని గ్రామస్తులు వాపోతున్నారు. అసలే వానాకాలం కావడంతో కలుషిత నీరు తాగడం వల్ల అనారోగ్యం పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు తక్షణమే స్పందించి లీకేజీని ఆపాలని, సురక్షిత నీరు అందించాలని కోరుతున్నారు.

నీటి కోసం విద్యార్థుల ఇక్కట్లు

- ఎడ్యుకేషన్ హబ్‌లలో ట్యాంకర్లతో సరఫరా
- సమస్య పరిష్కరించాలంటూ వేడుకోలు

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని బాలుర, బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లలో నీటి సమస్య తీవ్రంగా నెలకొంది. ఈ హబ్‌ల ఆవరణల్లోని హాస్టళ్లకు మిషన్ భగీరథ ద్వారా సరఫరా చేస్తున్న నీరు సరిపోకపోవడంతో ఇటీవల బోరుబావులను తవ్వించినప్పటికీ అవి ఇంకా వినియోగంలోకి రాలేదు. దీంతో బాలికల హబ్‌లో నీటి సమస్య తీవ్రంగా ఉండడంతో ట్యాంకర్ల ద్వారా నీటిని తెప్పించుకొని వినియోగిస్తున్నారు. వందలాది మంది విద్యార్థులుండే ఎడ్యుకేషన్ హబ్‌లలో నెలకొన్న నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని విద్యార్థులు కోరుతున్నారు. అదే విధంగా జాలిగామ బైపాస్ రోడ్డు మార్గంలో ఉన్న ఎస్టీ హాస్టల్, దాని పక్కనే ఉన్న ప్రాథమిక పాఠశాలకు సైతం నీటి సమస్య ఉంది. దీని పక్కనే ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకు ఉన్నా నీరు సరిపడా రావడం లేదు. అధికారులు, పాలకులు స్పందించి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని విద్యార్థులు వేడుకుంటున్నారు.

మత్తు పదార్థాలు విక్రయిస్తే కేసులు



బందారంలో యువతకు అవగాహన కల్పిస్తున్న సీఐ విద్యాసాగర్

కొండపాక(గజ్వేల్): మత్తు పదార్థాలను విక్రయించే వారిపై కేసులు నమోదు చేస్తామంటూ త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ హెచ్చరించారు. మండల పరిధిలోని బందారంలో మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాల గురించి శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలకు అలవాటుపడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. ఒక్కసారి అలవాటుపడితే మానుకోవడం కష్టంగా మారుతుందని చెప్పారు. సైబర్ మోసాలతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గంజాయి, డ్రగ్స్ తదితర మత్తు పదార్థాలను దూరం చేద్దామంటూ నినాదాలు చేస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పరశురాములు, నాయకులు దుర్గయ్య, భగవాన్‌రెడ్డి, గంగాధర్, వెంకటేశం, నీల సత్యం నరేశ్, మహేశ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కేబినేట్ ఆమోదంపై కాంగ్రెస్ సంబురాలు



హుస్నాబాద్: అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకుల సంబురాలు

హుస్నాబాద్/బెజ్జంకి(సిద్దిపేట): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు రాష్ట్ర కేబినేట్ ఆమోదం తెలుపడంపై కాంగ్రెస్ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. హుస్నాబాద్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్ర పటాలకు శనివారం క్షీరాభిషేకం చేశారు. జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి మాట్లాడుతూ బీసీ కులగణన చేపట్టి 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడం ఇదే మొదటి సారన్నారు. శివయ్య, రవీందర్, చందు, వెంకటరమణ, వీరన్న, నర్సాగౌడ్, రాజిరెడ్డి, బిక్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు. అలాగే బెజ్జంకిలో టపాసులు పేల్చి కేకు కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ పులి కృష్ణ, ఆలయ కమిటీ చైర్మన్ ప్రభాకర్, శ్రీనివాస్‌రెడ్డి, నర్సయ్య, పోచయ్య, శ్రీనివాస్, శ్రీకాంత్, సంతోష్, మధుసూదన్‌రెడ్డి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కే సాధ్యం..

కొండపాక(గజ్వేల్): బీసీలకు న్యాయం చేయడం కాంగ్రెస్‌తోనే సాధ్యమని పీఏసీఎస్ డైరెక్టరు సురేందర్‌రావు అన్నారు. వెలికట్ట క్రాస్‌రోడ్డు వద్ద శనివారం ఆయన మాట్లాడుతూ పదేళ్ల కాలంలో బీఆర్‌ఎస్ నాయకులు ఏనాడూ బీసీలకు న్యాయం చేయలేదని ఆరోపించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు వర్తించేలా కాంగ్రెస్ ముందుకు పోతుందన్నారు.